ఇజ్రాయెల్ ఎన్నికల్లో హంగ్: నెతన్యాహుకు షాక్.. ప్రతిపక్షాలదే స్వల్ప పైచేయి

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం

నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు - తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9059548848

హైదరాబాద్. | ఎడిటర్:- వై. రమ నాగరాజు | సంపుటి:-32 | సంచిక:-238 | బుధవారం 28-10-2026

తెలంగాణలో వరి వేసుకోవాలంటే ఇక ప్రభుత్వ అనుమతి తీసుకోవాలా? అన్న ప్రశ్న ఇప్పుడు రైతాంగంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.రోజూ ఆంధ్రాకు 1 టీఎంసీ

గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా

ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

- V తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో నీళ్లు తెస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్
- V ప్రస్తుత కరవు కాంగ్రెస్ తెచ్చిన కరవు అని విమర్శ
- V తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం సాధ్యమని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే

రాష్ట్రం పిచ్చోడి చేతిలో

రాయిలా మారింది

- ప్రభుత్వమే కృత్రిమ కరవు సృష్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ
- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శ
- మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో - మిగతా 2 లో

మాజీ మిస్ స్విట్జర్లాండ్‌పై ట్రంప్ అత్యాచారం

డెమోక్రాట్ల రిపోర్ట్‌లో సంచలన విషయాలు!

- V మాజీ మిస్ స్విట్జర్లాండ్‌పై ట్రంప్ అత్యాచారం చేశారని డెమోక్రాట్ల ఆరోపణ
- V ఈ ఆరోపణలను ఓ నివేదికలో పొందుపరిచిన డెమోక్రటిక్ పార్టీ
- V లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్ సంబంధాలపై ప్రత్యేక దర్యాప్తునకు డిమాండ్
- V ఇది రాజకీయ ప్రేరేపిత ఆరోపణ అని వైట్‌హౌస్ ఖండన
- V నవంబర్ 3 ఎన్నికల ముందు అమెరికాలో దుమారం రేపుతోన్న ఈ వ్యవహారం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సంచలన ఆరోపణలు వెల్లువెత్తాయి. మాజీ మిస్ స్విట్జర్లాండ్, మోడల్ అయిన బీట్రైస్ కీల్ - మిగతా 2 లో

'రోబోను పెట్టుకో, మనిషిని తీసెయ్'

ఏఐతో ఉద్యోగాల తొలగింపుపై బిల్ గేట్స్ వార్నింగ్!

- 'రోబోను నియమించుకుని, మనిషిని తొలగించే' ధోరణి పెరిగిందన్న గేట్స్
- మైక్రోసాఫ్ట్‌లో 60,000 మందికి స్వచ్ఛంద పదవీ విరమణ ఆఫర్
- భారత్‌లోని ఉద్యోగులకు కూడా వర్తించనున్న వాలంటరీ ఎగ్జిట్ ప్లాన్
- ఖర్చుల తగ్గింపు కోసమేనని, ఏఐ కారణం కాదని స్పష్టం చేసిన మైక్రోసాఫ్ట్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాకతో మానవ ఉద్యోగాలకు పెను ముప్పు పొంచి ఉందని, కంపెనీలు మానవుల - మిగతా 2 లో



కాకినాడ సమీపంలో

కేంద్రీకృతమైన తుపాను

- 8 కాకినాడకు 167 కి.మీ. దూరంలో 'అర్ణబ్ అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం
- 8 అర్ణబ్ తుపాను ముప్పుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- 8 లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలని కలెక్టర్లకు ఆదేశం
- 8 సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాల వినియోగం
- 8 విద్యుత్, రవాణా పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుఫాను ప్రస్తుత పరిస్థితి, ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధత, ముందస్తు చర్యలపై అధికారులకు ఆయన కీలక దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఈ తుపాను కాకినాడ సమీపంలోని యానాంకు 167 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని, గత

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
బుధవారం 28-10-2026

గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా: ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. గ్రావిటీతో నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న కరవుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్ ఆరోపించారు. "ఇది కాలం తెచ్చిన కరవు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నా ఎత్తిపోతలు చేపట్టకుండా ప్రభుత్వం రైతులను నష్టపరుస్తోందని విమర్శించారు. 33 శాతం వర్షపాతం లోటు ఉన్న ఏపీలో లేని క్రాప్ హాలిడే, కేవలం 17 శాతం లోటు ఉన్న తెలంగాణలో ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని, అసలు ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. తుమ్మిడిహెట్టి వద్ద తగినంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిన తర్వాతే, తమ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని ఆయన గుర్తుచేశారు.

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయవద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు. "రాష్ట్రం ప్రస్తుతం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది" అని కేటీఆర్ మండిపడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు. అయితే కేటీఆర్ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్'

విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపిస్తూ, ప్రముఖ వెబ్ సిరీస్‌ల పేర్లతో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో 'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్' మొదలైందని ఆయన ఎద్దేవా చేశారు. తేని జిల్లాలోని తెక్కంపట్టి సబ్ జైలు నుంచి నిన్న రాత్రి 17 మంది విచారణ ఖైదీలు పరారైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో స్పందించిన స్టాలిన్... సీఎం విజయ్ పరిపాలన వైఫల్యంపై విమర్శలు చేశారు. "బ్రేకింగ్ బ్యాడ్ తర్వాత ఇప్పుడు తమిళనాడులో ప్రిజన్ బ్రేక్ కూడా మొదలైంది. బెయిల్‌పై బయటకు వచ్చిన వారినే పర్యవేక్షించడం లేదనుకున్నా. కానీ ఈ చేతకాని ప్రభుత్వ హయాంలో జైళ్లలో ఉన్న ఖైదీలు కూడా సులభంగా తప్పించుకుంటున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. 1995 తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో ఖైదీలు తప్పించుకోవడం ఇదే మొదటిసారని స్టాలిన్ గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం ప్రజలను రక్షించలేదని, ప్రజలకు స్వీయరక్షణే శరణ్యమని ఆయన అన్నారు. ఇటీవల టీవీకే పార్టీ నేత ఒకరు నార్కోటిక్స్ కేసులో పట్టుబడినప్పుడు స్టాలిన్ ఆ పార్టీని 'బ్రేకింగ్ బ్యాడ్ పార్టీ' అని విమర్శించిన విషయం తెలిసిందే. తేని జైలు ఘటనలో, ఓ ఖైదీకి మూర్ఛ వచ్చిందని నమ్మించిన ఖైదీలు, సెల్‌లోకి వచ్చిన గార్డులపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటన తర్వాత అప్రమత్తమైన పోలీసులు, పరారైన వారిని పట్టుకోవడానికి 17 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నలుగురు ఖైదీలను తిరిగి అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులుగా తొమ్మిది మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ముఖ్యమంత్రి విజయ్ వద్దే హోం శాఖ ఉండటంతో, విపక్షాల విమర్శలకు ఆయన నేరుగా సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాకినాడకు 167 కి.మీ. దూరంలో 'అర్ణబ్ అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

ఆరు గంటలుగా గంటకు 23 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలపై తుపాను ప్రభావం, భారీ వర్షాల హెచ్చరికల గురించి సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుపాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, ఈదురు గాలులకు చెట్లు, హోర్డింగులు కూలిపోతే తక్షణమే తొలగించి రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తక్షణమే స్పందించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణలో 1.90 లక్షల మంది మహిళలకు కుట్టు మిషన్లు

ఈరోజు సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ, విద్యా నిధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు (మంగళవారం) సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. 38 బీసీ ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 9న మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీకి కార్యాచరణ చేపట్టాలని, కుట్టు మిషన్ల పథకానికి 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. తెలంగాణలోని 327 గురుకులాల్లో 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 301 గురుకులాలకు సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు, ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించాలన్నారు. బీసీలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణపై ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు విచారణ



న్యాయస్థానంలో విచారణలోనే ఉన్నాయి.

ఎన్నికల సంఘం ఏం చెప్పింది?

ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలన్నీ ఎన్నికల సంఘం ఏకగ్రీవంగానే తీసుకుందని కమిషన్ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపింది. మరోవైపు, ఈ నిర్ణయాలపై తమ అభ్యంతరాలను పరిశీలించాలని పిటిషనర్లు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణపై ఆసక్తి నెలకొంది.

బంగాళాఖాతంలో వాయుగుండం , వేగంతో కదులుతున్న 'అర్ణబ్'

మొదటిపేజీ తరువాయి - భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం బాపట్ల--విశాఖ తీరాల మధ్య తుపాను తీరం దాటే సూచనలు ఉన్నాయని ఆ సమయంలో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అవసరమైతే తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని, సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, బీచ్‌లలోకి పర్యాటకులను అనుమతించవద్దని సూచించారు. రైతులు, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, వ్యాప్తి చేయవద్దని తెలిపారు.12 జిల్లాలపై ప్రభావం: అర్ణబ్ తీవ్ర తుపాను కారణంగా 12 జిల్లాల్లో అత్యంత భారీవర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది ఈ నెల 28 నాటికి తీవ్ర ప్రభావం చూపనున్నట్లు వెల్లడించారు. మరోవైపు తుపాను ప్రభావంపై ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఈ నెల 27, 28 తేదీల్లో విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో అతి భారీ వర్షాలు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ నెల 29 నాటికి తుపాను తీవ్రత కాస్త తగ్గనుంది. ఆ రోజు ఏలూరు, పశ్చిమగోదావరి, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.మరోవైపు అత్యవసర పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ అధికారులను ఆదేశించారు. తుపాను పరిస్థితులపై టెలికాన్ఫరెన్స్ ద్వారా 12 జిల్లాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పండగ పూట ర్యాలీ వద్దు

మొదటిపేజీ తరువాయి - సీఈసీకి వ్యతిరేకంగా ఈ నిరసన కార్యక్రమం చేపడుతోన్న 'ఇండియా' కూటమి వ్యాపారుల విజ్ఞప్తిని పరిశీలిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే హామీ దేశ రాజధాని ఢిల్లీలో పండగ వాతావరణం నెలకొన్న వేళ, రాజకీయ వేడి రాజుకుంది. నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో 'ఇండియా' కూటమి తలపెట్టిన భారీ ర్యాలీని వాయిదా వేయాలని ఢిల్లీకి చెందిన వ్యాపారులు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మరోసారి విజ్ఞప్తి చేశారు. దీపావళి పండుగకు కొన్ని రోజుల ముందు ఈ ర్యాలీ నిర్వహించడం వల్ల తమ వ్యాపారాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని, సుమారు రూ.10,000 కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ప్రతినిధులు ఈ మేరకు రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. ఈ ర్యాలీకి దాదాపు 10 లక్షల మంది ప్రజలు, 15,000 నుంచి 20,000 బస్సులు వచ్చే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. దీనివల్ల మధ్య ఢిల్లీలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతుందని, పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయడం, రోడ్లు మూసివేయడం, మెట్రో స్టేషన్లను నిలిపివేయడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. రామ్‌లీలా మైదానానికి 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న చాందినీ చౌక్, సదర్ బజార్, చావ్డీ బజార్, కశ్మీరీ గేట్ వంటి ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని వారు పేర్కొన్నారు. సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ.. ధనత్రయోదశి (నవంబర్ 6), దీపావళి (నవంబర్ 8)కి వారం ముందు నుంచే పండుగ కొనుగోళ్లు ఊపందుకుంటాయని తెలిపారు. ఇటీవలే జరిగిన కొన్ని నిరసనల కారణంగా ఇప్పటికే వ్యాపార వర్గాలు రూ.3,000 కోట్ల నష్టాన్ని చవిచూశాయని, ఇప్పుడు ఈ ర్యాలీ కూడా జరిగితే నష్టం రూ.10,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. అందువల్ల ఈ కార్యక్రమాన్ని నవంబర్ 10 తర్వాత నిర్వహించాలని వారు కోరారు. వ్యాపారుల అభ్యర్థనపై రాహుల్ గాంధీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. ప్రభుత్వమే మెట్రోను నిలిపివేసి, రోడ్లను మూసివేస్తోందని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ తొలగిస్తే, 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ వ్యాపారుల విజ్ఞప్తిని పరిశీలిస్తామని సూచనప్రాయంగా తెలిపారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు, ఎలక్టోరల్ రోల్స్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు వ్యతిరేకంగా రాజకీయ పార్టీల నిరసన హక్కు మధ్య నెలకొన్న ఈ ప్రతిష్ఠంభనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

'రోబోను పెట్టుకో, మనిషిని తీసెయ్'

మొదటిపేజీ తరువాయి - స్థానంలో రోబోలను నియమించుకోవడానికి మొగ్గు చూపుతున్నాయని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఈ వ్యాఖ్యలు చేసిన కొద్ది గంటల్లోనే, మైక్రోసాఫ్ట్ సంస్థ సుమారు 60,000 మంది ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ (వాలంటరీ ఎగ్జిట్) ఆఫర్‌ను ప్రకటించడం టెక్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. 'ది అబ్జర్వర్'కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బిల్ గేట్స్ మాట్లాడుతూ, ఏఐ యుగాన్ని ఒక చారిత్రక పరిణామంగా అభివర్ణించారు. భూమిపై మనుషులే అత్యంత తెలివైన జీవులు అనే భావన ఇకపై చెల్లదని ఆయన వ్యాఖ్యానించారు. తొలుత వైట్ కాలర్ ఉద్యోగాలను, ఆ తర్వాత హ్యూమనాయిడ్ రోబోల ద్వారా శారీరక శ్రమతో కూడిన పనులను కూడా ఏఐ స్వాధీనం చేసుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. "రోబోను నియమించుకుని, మనిషిని తొలగించి, వెనక్కి తిరిగి చూడొద్దు" అనే ధోరణి వ్యాపార రంగంలో ప్రస్తుతం ప్రబలంగా ఉందని ఆయన విశ్లేషించారు. ఉద్యోగుల సంఖ్య తగ్గితే, ప్రభుత్వాలకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తగ్గిపోతుందని, ఇది సామాజిక భద్రతా పథకాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని గేట్స్ హెచ్చరించారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఏఐ వాడకంపై 'టోకెన్ ట్యాక్స్' విధించాలని, అలాగే తనలాంటి బిలియనీర్లపై పన్నులు పెంచాలని సూచించారు. తాను తన జీవితకాలంలో 14 బిలియన్ డాలర్ల పన్నులు చెల్లించానని, అవసరమైతే 40 బిలియన్ డాలర్లు చెల్లించడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. బిల్ గేట్స్ ఇంటర్వ్యూ ప్రచురితమైన మరుసటి రోజే మైక్రోసాఫ్ట్ ఈ వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్‌ను ప్రకటించడం గమనార్హం. అమెరికా, కెనడా, యూకే, భారత్‌లోని అర్హత కలిగిన బృందాలలో లెవెల్ 70, అంతకంటే తక్కువ స్థాయిలో ఉన్న ఉద్యోగులకు ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఇది కంపెనీ మొత్తం

వర్క్‌ఫోర్స్‌లో దాదాపు నాలుగో వంతు. అయితే, అన్ని బృందాలకూ ఇది వర్తించదు. ఈ ఆఫర్‌ను అంగీకరించిన ఉద్యోగులకు వారి సర్వీసు ఆధారంగా సెవరెన్స్ ప్యాకేజీ, కొంతకాలం పాటు స్టాక్ వెస్టింగ్, పరిమిత ఆరోగ్య బీమా, కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి సహాయం వంటివి అందిస్తారు. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి ఉద్యోగులకు డిసెంబర్ ఆరంభం వరకు గడువు ఇచ్చారు. అయితే, ఈ ఆఫర్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణం కాదని మైక్రోసాఫ్ట్ స్పష్టం చేసింది. ఏఐ రంగంలో భారీ పెట్టుబడుల కోసం నిధులను సమకూర్చుకోవడానికి, ఖర్చులను తగ్గించుకునే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో కూడా కంపెనీ స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని, అంతకుముందు ఉద్యోగుల తొలగింపులను చేపట్టిన విషయం తెలిసిందే. ఏఐ వల్ల ఔషధాల ఆవిష్కరణ వేగవంతం కావడం వంటి ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వాల పనితీరుకు ఇది ఒక పెద్ద పరీక్షగా నిలుస్తుందని గేట్స్ అభిప్రాయపడ్డారు.

మాజీ మిస్ స్విట్జర్లాండ్‌పై ట్రంప్ అత్యాచారం

మొదటిపేజీ తరువాయి - తనపై ట్రంప్ అత్యాచారం చేశారని ఆరోపించారు. ఈ మేరకు డెమోక్రటిక్ పార్టీ రూపొందించిన ఒక నివేదికలో ఈ ఆరోపణలను పొందుపరచడం అమెరికా రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. 1993 నవంబర్‌లో ట్రంప్ తనను అసభ్యంగా తాకారని గతంలో ఆరోపించిన కీల్, ఇప్పుడు అదే ఘటనలో ఆయన తనపై అత్యాచారం కూడా చేశారని పేర్కొనడం గమనార్హం.

డెమోక్రాట్ల నివేదికలో ఏముంది?

అమెరికా హౌస్ జ్యుడీషియరీ కమిటీలోని డెమోక్రాట్లు 53 పేజీల నివేదికను విడుదల చేశారు. లైంగిక నేరాలకు పాల్పడి జైలులో ఆత్మహత్య చేసుకున్న జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌కు ఉన్న సంబంధాలపై లోతుగా దృష్టిసారించిన డెమోక్రాట్లు, ఈ నివేదికలో ట్రంప్‌పై ఉన్న పాత లైంగిక ఆరోపణలను మళ్లీ తెరపైకి తెచ్చారు. ఈ నివేదికలో భాగంగా కీల్‌తో జరిపిన ఇంటర్వ్యూల వివరాలను పొందుపరిచారు. కీల్ కథనం ప్రకారం.. 1993లో అట్లాంటిక్ సిటీలోని ట్రంప్‌కు చెందిన ప్లాజా హోటల్‌లో ఈ ఘటన జరిగింది. జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో కలిసి గడిపిన తర్వాత, హోటల్ గదిలో ట్రంప్ తనపై 'క్రూరంగా' అత్యాచారం చేశారని ఆమె ఆరోపించారు. తనకు 24 ఏళ్ల వయసులో న్యూయార్క్‌లోని ప్లాజా హోటల్‌లో జరిగిన ఒక అందాల పోటీల కార్యక్రమంలో తొలిసారి ట్రంప్‌ను కలిశానని ఆమె తెలిపారు. ఆ సమయంలో తనకు వీసా ఇప్పిస్తానని, న్యూయార్క్ యూనివర్సిటీలో సీటు కూడా చూస్తానని ట్రంప్ హామీ ఇచ్చారని, "నిన్ను నేను చూసుకుంటా" అని చెప్పారని కీల్ పేర్కొన్నారు. అనంతరం ట్రంప్ పక్కకు వెళ్లిన వెంటనే జెఫ్రీ ఎప్‌స్టీన్ తన వద్దకు వచ్చి, తాను ట్రంప్‌కు బెస్ట్ ఫ్రెండ్‌నని పరిచయం చేసుకుని పార్టీకి ఆహ్వానించాడని ఆమె తెలిపారు. ఆ తర్వాత, ట్రంప్‌ను కలవడానికి తనను పై అంతస్తుకు పిలిచారని, గదిలోకి ప్రవేశించిన వెంటనే ట్రంప్ వెనుక నుంచి పట్టుకుని, బలవంతంగా అత్యాచారం చేశారని నివేదికలో పేర్కొన్నారు. ఈ దాడిలో తన దుస్తులు చిరిగిపోయాయని, శరీరంపై పలుచోట్ల గాయాలై రక్తస్రావం కూడా జరిగిందని ఆమె వివరించారు. అత్యాచారం తర్వాత ట్రంప్ తనను మంచంపై కూర్చోబెట్టి, వీసా, యూనివర్సిటీ అడ్మిషన్ హామీలను పునరావృతం చేస్తూ, ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని, "షో కొనసాగాలి" అని అన్నారని కీల్ ఆరోపించారు.



డెమోక్రాట్ల డిమాండ్.. వైట్‌హౌస్ ఖండన

ట్రంప్ ప్రవర్తనా సరళికి కీల్ ఆరోపణలు అద్దం పడుతున్నాయని డెమోక్రాట్లు అంటున్నారు. అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ ఈ కేసులో ట్రంప్‌ను రక్షించే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే ట్రంప్-ఎప్‌స్టీన్ సంబంధాలపై స్వతంత్ర ప్రత్యేక న్యాయవాదిని నియమించి దర్యాప్తు జరిపించాలని హౌస్ జ్యుడీషియరీ కమిటీ డెమోక్రాట్ ప్రతినిధి జేమీ రాస్కిన్ డిమాండ్ చేశారు. అయితే, ఈ ఆరోపణలను వైట్‌హౌస్ తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, నవంబర్ 3న జరగనున్న కాంగ్రెస్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని డెమోక్రాట్లు చేస్తున్న అసత్య ప్రచారమని రిపబ్లికన్ పార్టీ అధికార ప్రతినిధి ఒకరు విమర్శించారు. అధ్యక్షుడు ట్రంప్ చారిత్రక విజయాలతో రిపబ్లికన్లకు పెరుగుతున్న ఆదరణను దెబ్బతీసేందుకే ఈ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ ఎన్నికల నేపథ్యంలో డెమోక్రాట్లు ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ప్రకటనల కోసం ఇప్పటికే 35 మిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

సౌదీ మక్కాలో క్షిపణి ముప్పు

మొదటిపేజీ తరువాయి - వైమానిక రక్షణ వ్యవస్థలు తిప్పికొట్టడంతో ప్రమాదం తొలగిపోయినట్లు ప్రకటించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జెద్దా, యన్బు, రియాద్, తాయిఫ్ ప్రాంతాల్లోనూ ఇలాంటి హెచ్చరికలు జారీ చేసి, తర్వాత పరిస్థితులు సద్దుమణిగినట్లు సౌదీ పౌర రక్షణ విభాగం తెలిపింది. నేషనల్ ఎర్లీ వార్నింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా మక్కా ప్రావిన్స్ ప్రజల్ని అప్రమత్తం చేసినట్లు ఎక్స్‌లో వెల్లడించింది. ప్రజలు భద్రతా సూచనలు పాటించాలని, గుమిగూడొద్దని, ప్రమాదాలకు సంబంధించిన దృశ్యాలను చిత్రీకరించవద్దని సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో 911 కు ఫోన్ చేయాలని స్పష్టం చేసింది.యెమెన్‌లోని హూతీ మిలీషియా తాయిఫ్, యన్బు నగరాలవైపు ప్రయోగించిన రెండు బాలిస్టిక్ క్షిపణులను సౌదీ వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకొని ధ్వంసం చేశాయి. ఈ మేరకు సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాల అధికార ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్ మాల్కీ వెల్లడించారు. అంతకుముందు రియాద్‌వైపు ప్రయోగించిన మరో బాలిస్టిక్ క్షిపణిని కూడా అడ్డుకున్నట్లు సంకీర్ణ దళాలు ప్రకటించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సౌదీ పౌర, కీలక మౌలిక సదుపాయాల భద్రతపై ఆందోళనలు పెరిగాయి. అక్టోబర్ 21న కింగ్ ఫహద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, సౌదీ ఆరాంకోకు చెందిన షైబా చమురు క్షేత్రంపై దాడులు జరిగాయి. ఈ ఘటనల్లో ఒక భారతీయుడు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ దాడుల్ని ఇదివరకే భారత్ ఖండించింది.అల్ జజీరా రిపోర్ట్ ప్రకారం- యెమెన్‌లోని తాయిఫ్ ప్రాంతంలో సౌదీ మద్దతు ఉన్న ప్రభుత్వ దళాలు, హూతీ తిరుగుబాటుదారుల మధ్య తీవ్ర ఘర్షణలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఫిరంగి దాడులు, వైమానిక దాడులు జరిగినట్లు నివేదికలు పేర్కొన్నాయి. సౌత్ యెమెన్‌లోని అల్- మకాత్రా కోటపై హూతీలు దాడి చేసినట్లు పేర్కొంది. ఇదే సమయంలో యెమెన్‌లోని సాదా ప్రావిన్స్‌లో అల్- సలేం, కితాఫ్, అల్ బఖా ప్రాంతాలపై మళ్లీ వైమానిక దాడులు జరిగినట్లు హూతీ మీడియా వెల్లడించింది.హూతీ తిరుగుబాటుదారులు, సౌదీ ప్రభుత్వ దళాల మధ్య దాడుల నేపథ్యంలో సౌదీ అరేబియాలోని భారతీయులకు అక్కడి ఇండియన్ ఎంబసీ (రాయబార కార్యాలయం) కీలక సూచనలు చేసింది. భారతీయులు స్థానిక చట్టాలు, నిబంధనలు పాటించాలని సూచించింది. క్షిపణులు, డ్రోన్లను అడ్డుకునే చర్యలు, అవి పడిన ప్రాంతాలకు సంబంధించిన దృశ్యాల్ని చిత్రీకరించడం, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం, ఇతరులకు షేర్ చేయడం వంటివి చేయొద్దని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే సౌదీ పౌర రక్షణ విభాగం జారీ చేసిన నోటీసుల్ని ఇండియన్ ఎంబసీ ఎక్స్‌లో పంచుకుంది. జెద్దాలోని భారత కాన్సులేట్ కూడా ఇదే తరహా సూచనలు జారీ చేసింది.భద్రతా పరిస్థితులు, విమాన రాకపోకల్లో అంతరాయాల కారణంగా ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసులపై ప్రభావం పడింది. రియాద్, దమ్మామ్‌కు వెళ్లే, ఇంకా అక్కడి నుంచి వచ్చే విమానాలను 2026, నవంబర్ 7 వరకు నిలిపివేసినట్లు భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ఇంకా జెద్దాకు వెళ్లే, అక్కడి నుంచే సర్వీసులను కూడా అక్టోబర్ 31 వరకు నిలిపివేయనున్నట్లు శనివారం ప్రకటించింది. జెద్దా, మక్కాలోని భారత కాన్సులేట్ 24 గంటల కంట్రోల్ రూమ్‌ల ద్వారా భారతీయులకు సహాయం అందిస్తోంది. అవసరమైన చోట ఆహారం, అత్యవసర మందులు, ఇతర ప్రాథమిక అవసరాలు సమకూర్చేందుకు పౌర సమాజ సంఘాలు, స్వచ్ఛంద కార్యకర్తలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది. వీసాల గడువు, విమానాల ఆలస్యం, స్వదేశానికి తిరుగుపయనం వంటి సమస్యల పరిష్కారానికి సౌదీ హజ్, ఉమ్రా మంత్రిత్వ శాఖతో సహా విదేశాంగ శాఖ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొంది. ఇదే సమయంలో సౌదీ పౌర మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడుల్ని భారత్ తీవ్రంగా ఖండించింది. దాడుల్ని తక్షణమే నిలిపివేయాలని,

వరి వేయాలంటే ప్రభుత్వ పర్మిషన్ కావాల్సిందేనా?

మొదటిపేజీ తరువాయి - చొప్పున కృష్ణా జలాలను వదిలిపెడుతూ, తెలంగాణ రైతుకు మాత్రం నీళ్లు, కరెంటు ఇవ్వలేని రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఇప్పుడు దుర్మార్గపు ఆలోచనకు తెరలేపింది. సెల్ఫ్ డిక్లరేషన్ పేరుతో మెలిక.వరి విత్తనాలు కొనాలంటే రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని వ్యవసాయ శాఖ విత్తన డీలర్లకు ఆదేశాలు జారీ చేసింది. "పంట ఎండిపోయినా, కరెంటు లేకున్నా, నీళ్లు లేకున్నా ప్రభుత్వానికి సంబంధం లేదు, మాపై ఎలాంటి ఒత్తిడి చేయము" అని రైతుల నుంచి ముందే రాతపూర్వకంగా రాయించుకునే దుస్థితికి ప్రభుత్వం దిగజారింది. పంటలను కాపాడాల్సిన ప్రభుత్వమే, తన బాధ్యత నుంచి.తప్పించుకోవడానికి ఈ డిక్లరేషన్ నాటకం ఆడుతోందని రైతు సంఘాలు మండిపడుతున్నాయి. రేవంత్ మాటలకు అనుగుణంగానే. "వరి వేయొద్దు" అని గతంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగానే ఇప్పుడు వ్యవసాయ శాఖ ఈ నిబంధన తీసుకొచ్చిందని విమర్శలు వస్తున్నాయి. ఎల్ నినో ప్రభావంతో ఆరుతడి పంటలకు కూడా విత్తనాలు, నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి రైతుల మెడకు డిక్లరేషన్ ఉచ్చు బిగిస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు ఆంధ్రాకు తరలిస్తూ, ఇక్కడ వరి వేసుకునే రైతుకు పర్మిషన్ పేరుతో సంకెళ్లు వేయడం ఏం న్యాయమని ప్రశ్నిస్తున్నారు. వార్తా నిర్భయం డిమాండ్ రైతు వ్యతిరేక సెల్ఫ్ డిక్లరేషన్ నిబంధనను వెంటనే ఎత్తివేయాలి, రైతులకు నిరంతర కరెంటు, సాగునీరు అందించాలి.

నిలువుటద్దం

బుధవారం 28-10-2026

ప్రతి భూ యజమానికి 'భూదార్' ప్రత్యేక గుర్తింపు సంఖ్య.

ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూ పటాలు పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరుస్తాం.

ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే.

రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపును 15 రోజుల్లో పూర్తి చేయాలి.

ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం.. రైతులు సహకరించాలి.

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

సంగారెడ్డి, అక్టోబర్ 27 నిలువుటద్దం ప్రతినిధి ప్రతినిధి :-- రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం, భూ హక్కుల పరిరక్షణ, పారదర్శక భూ రికార్డుల నిర్వహణ లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతి భూ యజమానికి ఆధార్ తరహాలో 'భూదార్' పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించే విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూ పటాలను పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరచనున్నట్లు చెప్పారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, గృహ నిర్మాణ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు, భూ సర్వే, రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి సమస్యలు తదితర అంశాలపై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా భూ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. గతంలో అమల్లో ఉన్న ధరణి విధానంలో ఎదురైన సమస్యలకు పరిష్కారం చూపుతూ, భూ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చా మన్నారు.తొలి విడతలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు సర్వేను పూర్తి చేసి, భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డులకు సంబంధించి స్పష్టత తీసుకురావాలని అధికారులకు సూచించామని తెలిపారు. ఇప్పటికే ఏడు ఉమ్మడి జిల్లాల్లో ఇదే తరహా సమీక్షా సమావేశాలు నిర్వహించామని, ఎనిమిదో సమావేశాన్ని ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు భూ యజమానుల హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి పేదవాడి భూ హక్కులకు రక్షణ ప్రజా ప్రభుత్వం పేదలు, నిరుపేదలు, భూములు కలిగిన రైతులు సహా అన్ని వర్గాల ప్రజల హక్కులకు రక్షణ కల్పించేలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్తులోనూ ప్రజల పక్షాన నిలిచి, వారి హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. గతంలో అసంపూర్తిగా వదిలేసిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధితో పూర్తి చేస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు 90 శాతం ఇళ్లను అర్హులైన పేదలకు కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా కేటాయించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన ఇళ్లను కూడా 15 రోజుల్లోగా అర్హులకు కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అదేవిధంగా, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో నీటి లభ్యతపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే సింగూరు వంటి ప్రాజెక్టుల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయని, రాబోయే రోజుల్లో ఇతర ప్రాజెక్టుల్లోనూ తాగునీటి లభ్యతకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా కరువు పరిస్థితులు తీవ్రతరం అయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రెండో పంట సాగుకు అవసరమైన నీరు, విద్యుత్‌ను సమకూర్చేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసినా, నీటి లభ్యతే ప్రధాన సమస్యగా మారే పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఈ సమస్య ఒక్క తెలంగాణకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా నీటి ఎద్దడి పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు పరిస్థితులను అర్థం చేసుకొని, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుకు వెళ్లవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. నీటి వనరుల పరిరక్షణలో రైతులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. నీటి కొరతపై ప్రజలు, రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించడంలో ప్రతిపక్షాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి కోరారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధులను అందించి సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఈ అంశాలపై చర్చించేందుకు రేపు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని పూర్తిగా నమ్ముతున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రైతుల ప్రయోజనాలు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

జిల్లా సమీక్షా సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించకుండా గొప్పలు చెప్పుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారు

ఎమ్మెల్యే చింత ప్రభాకర్

బలవంతపు భూ సేకరణ చేయడం సరి కాదు.

సంగారెడ్డి అక్టోబర్ 27 నిలువుటద్దం న్యూస్ ప్రతినిధి : ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై సమగ్రంగా చర్చించకుండా, ప్రభుత్వ గొప్పలు చెప్పుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విమర్శించారు... సమావేశానికి మీడియాను అనుమతించకపోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. మీడియాకు అవకాశం కల్పిస్తే ప్రజా సమస్యలపై ప్రశ్నలు అడుగుతారని, ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయని భయపడుతున్నారా అని నిలదీశారు....

ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై సమాధానం ఏది?

ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని, సంగారెడ్డిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి మిగిలిన పనులు పూర్తి చేసి మూడేళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపు కోసం ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

అసైన్డ్ భూములపై ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

ఎన్నికల మేనిఫెస్టోలో అసైన్డ్ భూములకు హక్కులు కల్పించి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ అవసరాల కోసం భూములు తీసుకుంటే మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తామని చెప్పిన మాట ఏమైందని నిలదీశారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ పరిష్కరించకపోవడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు.

ఎల్‌నినో, కరువు పరిస్థితులపై ముందస్తు ప్రణాళిక ఏది?

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక రూపొందించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సింగూరు నీటి నిర్వహణపై ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు!

సింగూరు ప్రాజెక్టులో వర్షాకాలానికి ముందే నీటి నిల్వలను తగ్గించడం, మరమ్మతుల పేరుతో నీటిని విడుదల చేయడంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. వర్షాలు కురిసినప్పుడు ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరే అవకాశమున్నప్పటికీ, నీటి నిల్వలను సమర్థంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళిక ఎందుకు రూపొందించలేదని ప్రశ్నించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో సముద్రాల్లో సైతం భారీ నిర్మాణాలు చేపడుతున్నారు... అలాంటప్పుడు సింగూరు ప్రాజెక్టు నీటి నిల్వలను సమర్థంగా నిర్వహించడానికి శాశ్వత పరిష్కారాలు ఎందుకు కనుగొనలేకపోతున్నారని నిలదీశారు. ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చించి, సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన సమావేశాలు కేవలం ప్రభుత్వ ప్రచార వేదికలుగా మారకూడదని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, అసైన్డ్ భూముల హక్కులు, కరువు నివారణ, సింగూరు నీటి నిర్వహణ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు లేవని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం మానుకుని, ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి బండి రమేష్ సంకల్పం!

బసంతి ఫౌండేషన్ సహకారంతో ఫ్యాన్లు, ఫర్నిచర్, 1,500 వాటర్ బాటిళ్ల అందజేతకు చొరవ

నూతన కళాశాల నిర్మాణం కోసం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి సమస్య.......

శేరిలింగంపల్లి, నిలువుటద్దం ప్రతినిధి: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య కళాశాలలో సీలింగ్ ఫ్యాన్లు, ఫర్నిచర్ కొరతతో పాటు పాత భవనం కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన, బసంతి ఫౌండేషన్ చైర్మన్ అజయ్‌తో మాట్లాడి కళాశాలకు సీలింగ్ ఫ్యాన్లు, ఫర్నిచర్‌తో పాటు విద్యార్థుల కోసం 1,500 గ్లాస్ వాటర్ బాటిళ్లు అందించేందుకు చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాలను గుర్తించి వెంటనే సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన బసంతి ఫౌండేషన్ చైర్మన్ అజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా మరింత మంది విద్యార్థులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.

శిథిలావస్థలో కళాశాల భవనం.. పరిమితంగా ప్రవేశాలు!

కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పాతదై శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బండి రమేష్ తెలిపారు. కళాశాలలో ప్రవేశాల కోసం వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నప్పటికీ, ప్రస్తుతం సుమారు 1,500 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పించే పరిస్థితి ఉందని ప్రిన్సిపాల్ తన దృష్టికి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు కళాశాల స్థల సమస్యను పరిష్కరించి, నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ సహకారంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతల భాగస్వామ్యంతో మరిన్ని వసతులు కల్పించే అవకాశాలను కూడా పరిశీలిస్తానని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలి!

విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే పునాది అని బండి రమేష్ అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యాసంస్థలను బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం, మరింత మందికి విద్యావకాశాలు అందించడం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులతో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము వేణు, చున్ను పాషా, సప్పిడి భాస్కర్, తూము సంతోష్, శంకర్, రఘు, పుష్పారెడ్డి, జ్యోతి, సోను, రమణ, నళినీకాంత్, వాసు, హుస్సేన్, బాలరాజు, అక్బర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికి ఇంటి స్థలం ఇవ్వాలి.!

హెల్త్ కార్డు ఇవ్వకపోవడంతో రోడ్డున పడుతున్న జర్నలిస్టు కుటుంబాలు

మిగిలిన వారికి కూడా అక్కడేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలి

మంత్రి పొంగులేటికి టీయూడబ్ల్యూజే ఐజేయు వినతి

సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి

సంగారెడ్డి, నిలువుటద్దం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ఉన్న అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇంటి స్థలాలను మంజూరు చేయాలని రాష్ట్ర రెవిన్యూ ,హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ను టియుడబ్ల్యూజే ఐజేయు సంగారెడ్డి జిల్లా శాఖ కోరింది. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్తు లో మంగళవారం మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం టియుడబ్ల్యూజేఐజేయు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో సంఘ నేతలు మంత్రికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్నదని, ఇప్పటివరకు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించలేదని ఈ సందర్భంగా బండారు యాదగిరి పేర్కొన్నారు. తక్షణమే అర్హులైన వారి జాబితాన్ని సేకరించి, ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా హెల్త్ కార్డులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా నగదు రహిత వైద్య సేవలను జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు అందే విధంగా చూడాలని పేర్కొన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం వల్ల..పేద జర్నలిస్టులు, వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ,హెల్త్ కార్డును ఇవ్వక పోవడం సమంజసం కాదని అన్నారు. దీనివల్ల జర్నలిస్టుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని బండారు యాదగిరి వివరించారు. ఇంకా అనేకమంది అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అందలేదని వారికి కూడా అక్రిడేషన్ కార్డులను అందించాలని మంత్రికి మూడో డిమాండ్ గా విన్నవించారు. దీంతో మంత్రి వెంటనే స్పందించారు. హైదరాబాద్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలను త్వరలో ఇవ్వబోతున్నామని చెప్పారు. ఆ తర్వాత సంగారెడ్డి జిల్లాలో అర్హులందరికీ ఇంటి స్థలాలను కచ్చితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో నిశ్చింతగా ఉండాలని మంత్రి పొంగులేటి తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రి రాజనర్సింహ కూడా సానుకూలంగా స్పందించారు. సంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల సమస్యలను మంత్రి పొంగిలేటికి సంక్షిప్తంగా వివరించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కూడా వేదికపై ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేఐజేయు నాయకులు రాజు నాయక్, హెచ్ఎంటీవీ శ్రీనివాస్, బాలయ్య, శ్రీకాంత్, ఫోటో జర్నలిస్టుల సంఘ అధ్యక్షుడు ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే జీఎంఆర్

– సోదరుడి కుమారుడి నిశ్చితార్థానికి ఆహ్వానం

పటాన్‌చెరు, అక్టోబర్ 27 (నిలువుటద్దం న్యూస్) : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్)ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుతో కలిసి ఆయన కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి కుమారుడు గూడెం సందీప్‌రెడ్డి నిశ్చితార్థ వేడుకకు హాజరుకావాలని కేసీఆర్‌ను ఎమ్మెల్యే జీఎంఆర్ ఆహ్వానించారు. అనంతరం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్య పరిరక్షణ

– 'ఓటు బచావో్--దేశ్ బచావో' కార్యక్రమంపై కాంగ్రెస్ సమీక్ష

– అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా చూడాలి

– అశోక్‌నగర్‌లో కాట శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన సమావేశం

– హాజరైన ఏఐసీసీ అబ్జర్వర్ సరల్ పటేల్, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

– పాల్గొన్న కోఆర్డినేటర్లు నాగరిగారి ప్రీతమ్, గూడూరు శ్రీనివాస్

రామచంద్రాపురం, అక్టోబర్ 27 (నిలువుటద్దం ప్రతినిధి): ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓటు బచావో--దేశ్ బచావో' కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన రామచంద్రాపురం పరిధిలోని అశోక్‌నగర్‌లో ఆయన నివాసంలో జరిగిన ఈ సమావేశానికి ఏఐసీసీ అబ్జర్వర్ సరల్ పటేల్, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్లు నాగరిగారి ప్రీతమ్, గూడూరు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి పౌరుడికి ఆ హక్కు అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు, జాబితాల్లోని తప్పులను నిబంధనల ప్రకారం సరిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా సంబంధిత అంశాలపై దృష్టి సారించాలని సూచించారు.

ఓటరు జాబితాల్లో తప్పుల సవరణపై దృష్టి పెట్టాలి..

ఓటరు జాబితాల సవరణ సమయంలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఉన్న తప్పులను గుర్తించి సరిచేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు అనవసరంగా తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలని, ఓటు హక్కు పొందేందుకు అర్హత కలిగిన యువత నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల ద్వారా సరిచేసుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పిలుపు..

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటుకు ప్రాధాన్యం ఉంటుందని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగేలా ఓటరు హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. 'ఓటు బచావో--దేశ్ బచావో' కార్యక్రమం ద్వారా ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఓటరు జాబితాలపై అవగాహన పెంచేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా కృషి చేయడం, ఓటరు జాబితాల్లోని తప్పులను సరిచేయడంపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలపై నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
బుధవారం 28-10-2026

అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం!

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం

నిజాంపేట్‌లో అవగాహన కార్యక్రమం.. పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి.....

నిజాంపేట్ నిలువుటద్దం ప్రతినిధి: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సూచించారు. నిజాంపేట్‌లోని కొలన్ రాఘవరెడ్డి గార్డెన్స్‌లో వారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవడం ఎంతో ముఖ్యమని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదు ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. ఓటరు నమోదుకు అవసరమైన విధివిధానాలు, అర్హతలు, సమర్పించాల్సిన పత్రాలపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి అర్హుడికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని, అర్హులైన ఓటర్లు ఎవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా కృషి చేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

రెజ్లింగ్‌లో శివాని స్వర్ణ గర్జన!

రాష్ట్ర స్థాయిలో బంగారు పతకంతో కూకట్‌పల్లికి కీర్తి ప్రతిష్ఠలు

విజేత నాడికుడి శివానిని అభినందించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు.........

కూకట్‌పల్లి, నిలువుటద్దం ప్రతినిధి: రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో రెజ్లింగ్ విభాగంలో బంగారు పతకం సాధించి కూకట్‌పల్లికి గర్వకారణంగా నిలిచిన నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని నాడికుడి శివానిపై అభినందనలు వెల్లువెత్తాయి. 57 కేజీల విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న శివాని, తన క్రీడా నైపుణ్యంతో అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా శివాని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన శివానిని రాజేశ్వరరావు అభినందించి ఆశీర్వదించారు. క్రీడారంగంలో ఆమె సాధించిన విజయాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలి!

క్రీడల పట్ల అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాజేశ్వరరావు పేర్కొన్నారు. శివాని భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి తన తల్లిదండ్రులతో పాటు కూకట్‌పల్లి ప్రాంతానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ తన ప్రతిభను చాటుకుని విజయపరంపరను కొనసాగించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి కొడిచర్ల వినోద్ కుమార్, ఖైతలాపూర్ డివిజన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొని శివానిని అభినందించారు.

కేసీఆర్ పాత్రలో మెప్పించిన ప్రియదర్శి..

శాలువాతో సత్కరించిన చిర్ర రవీందర్ యాదవ్

శేరిలింగంపల్లి,నిలువుటద్దం ప్రతినిధి: 'పారడైజ్' చిత్రంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు కేసీఆర్ పాత్రలో నటించిన ప్రముఖ సినీ నటుడు ప్రియదర్శిని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిర్ర రవీందర్ యాదవ్ ఆత్మీయంగా సత్కరించారు. తన నివాసంలో ప్రియదర్శిని కలిసిన ఆయన శాలువాతో సన్మానించి, శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిమను బహూకరించారు. ఈ సందర్భంగా 'మల్లేశం', 'బలగం' చిత్రాల్లో ప్రియదర్శి కనబరిచిన నటనా ప్రతిభను చిర్ర రవీందర్ యాదవ్ అభినందించారు. తెలంగాణ పల్లె జీవనశైలి, సంస్కృతి, మట్టివాసనను వెండితెరపై ఆవిష్కరించే చిత్రాలు ప్రేక్షకులకు మరింత చేరువవుతున్నాయని పేర్కొన్నారు.

సంగారెడ్డిలో గంజాయి సాగుపై ఎక్సైజ్ దాడులు

రెండు చోట్ల తనిఖీలు.. ఎండు గంజాయి, 10 మొక్కలు స్వాధీనం

ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలింపు

సంగారెడ్డి నిలువుటద్దం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో గంజాయి సాగు, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ నిఘా ముమ్మరం చేసింది. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అక్టోబర్ 26న ఎక్సైజ్ సిబ్బంది రెండు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. సదాశివపేట మండలం ఆనంపూర్ శివారులోని సర్వే నంబర్ 206లో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే అంకెన్‌పల్లి గ్రామంలోని షెడ్‌లో తనిఖీలు నిర్వహించగా, ఇంట్లో దాచి ఉంచిన 150 గ్రాముల ఎండు గంజాయి, 10 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఎఈఎస్ (ట్రైనీ) అభినవ్‌రెడ్డి, సీఐ సరిత, ఎస్ఐ సృజన్‌తో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి సాగు, విక్రయాలపై సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు. దాడుల్లో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులను, సిబ్బందిని మెదక్ డిప్యూటీ కమిషనర్ ఏ. చంద్రయ్య అభినందించారు.

28న ఐఎఫ్‌డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

కుత్బుల్లాపూర్: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఈనెల 28న ఉదయం 10 గంటలకు సూరారం అంబేద్కర్ భవనంలో నిర్వహించనున్నట్లు టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టెల మల్లేష్, గడ్డమీది అశోక్ తెలిపారు. 1950 అక్టోబర్ 28న ఢిల్లీలో ఏర్పాటైన ఐఎఫ్‌డబ్ల్యూజే జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. జర్నలిస్టులు పెద్దసంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం.. ప్రజల గొంతుకగా నిలుస్తా!

కూకట్‌పల్లి కాంగ్రెస్ మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా షేక్ నవాజ్ బాధ్యతల స్వీకరణ

బండి రమేష్ సమక్షంలో ఘనంగా పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమం.. భారీ ర్యాలీతో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు.......

కూకట్‌పల్లి, నిలువుటద్దం ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మైనారిటీల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా నియమితులైన షేక్ నవాజ్ స్పష్టం చేశారు. జనతా నగర్‌లోని తన నివాసం నుంచి కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరిన ఆయన.. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమదుర్గా భవన్‌కు చేరుకున్నారు. అక్కడ తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు షేక్ నవాజ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్ని వర్గాలకు సమాన గౌరవం కల్పించేది కాంగ్రెస్ పార్టీ

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించే పార్టీ అని పేర్కొన్నారు. మైనారిటీ సోదరుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. పార్టీలో ప్రతి ఒక్కరికీ రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. షేక్ నవాజ్‌కు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మైనారిటీ సోదరులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మైనారిటీల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్తూ, వారి గొంతుకగా నిలుస్తారనే విశ్వాసం తనకు ఉందని బండి రమేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తా

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన షేక్ నవాజ్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన బండి రమేష్‌కు, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బండి రమేష్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. మైనారిటీ సోదరుల సమస్యలను గుర్తించి, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని షేక్ నవాజ్ హామీ ఇచ్చారు.

నాయకులు, కార్యకర్తల అభినందనలు

ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు, అడ్వకేట్ హుస్సేన్, బి-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, మైనారిటీ చైర్మన్ ఎండీ చున్ను పాషా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ సలీం, రాష్ట్ర ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్, కాంగ్రెస్ నాయకులు పులి శివ, సప్పిడి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు తూము సంతోష్, కాలికోట శంకర్, రాజేష్ గౌడ్, మైనారిటీ వైస్ చైర్మన్ ఎండీ నయీమ్, కాంగ్రెస్ నాయకులు రమణ, అక్బర్, మల్లేష్ యాదవ్, అస్లాం, తూము సచిన్, ఎండీ యూసఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై షేక్ నవాజ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం షేక్ నవాజ్ ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. నూతన బాధ్యతలతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించి, మైనారిటీ వర్గాలకు చేరువయ్యేందుకు కృషి చేస్తానని షేక్ నవాజ్ పేర్కొన్నారు.జంజువాజ్

పదేళ్ల పాలనలో రహదారి సమస్యను ఎందుకు పరిష్కరించలేదు?

బంగారు తెలంగాణ మాటలకే పరిమితమైంది..

ప్రజలకు రోడ్డు సౌకర్యం కరువైంది

కేసీఆర్, హరీశ్‌రావు, మహిపాల్‌రెడ్డిపై ఎంపీ రఘునందన్‌రావు విమర్శలు

భానూర్ ఫార్మేషన్ రోడ్డు పనులకు రూ.10 లక్షలతో శంకుస్థాపన

పటాన్‌చెరు, నిలువుటద్దం ప్రతినిధి: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బంగారు తెలంగాణ నిర్మించామని చెప్పుకున్న నాయకులు.. నవపాన్ చౌరస్తా నుంచి శంకర్‌పల్లి వరకు రహదారిని ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌కు సమీపంలోనే ఉన్న పారిశ్రామిక ప్రాంతంలో రహదారి సమస్యలు కొనసాగడం గత పాలకుల పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఫార్మేషన్ రోడ్డు పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గత పదేళ్లలో ముఖ్యమంత్రి, మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ అంతా బీఆర్ఎస్‌కు చెందినవారే అయినప్పటికీ ప్రజల చిరకాల రహదారి సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారని నిలదీశారు. భానూర్, బీడీఎల్ పరిసర ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు ఉన్నప్పటికీ ప్రధాన రహదారి అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు.

ఏళ్లుగా సమస్య.. పరిష్కారం ఏది?

సుమారు 13 ఏళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్న గూడెం మహిపాల్‌రెడ్డి ఈ రహదారి సమస్యపై ఎందుకు దృష్టి సారించలేదని రఘునందన్‌రావు ప్రశ్నించారు. గత ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి హయాంలోనూ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని వ్యాఖ్యానించారు. బంగారు తెలంగాణ అంటూ ప్రచారం చేసుకోవడం కాదని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే అభివృద్ధికి అర్థం ఉంటుందని అన్నారు.

రోడ్డు అభివృద్ధికి రూ.8.30 కోట్లు

తాను ఎంపీగా ఎన్నికైన తర్వాత ఈ రహదారి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ రోడ్ ఫండ్ కింద రూ.8.30 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నానని పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా విమర్శలు చేస్తూ, ప్రజలకు కనీస తాగునీటి సదుపాయం కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. భానూర్ గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాంతయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం క్షుద్ర పూజలు!

సర్పంచ్ భర్త, కుమారుడు సహా తొమ్మిది మందిని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

మెదక్ జిల్లా, నిలువుటద్దం ప్రతినిధి: గుప్తనిధుల కోసం క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారన్న అనుమానంతో గ్రామస్తులు తొమ్మిది మందిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం.. అర్ధరాత్రి సమయంలో గ్రామంలో కొందరు క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ పూజలు చేస్తున్నట్లు భావించిన తొమ్మిది మందిని పట్టుకుని దాడి చేసి పోలీసులకు అప్పగించారు. వారిలో వెల్దుర్తి మండలం రామాయపల్లి గ్రామ సర్పంచ్ భర్త మహేందర్, ఆయన కుమారుడు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు సేకరిస్తూ ఘటనపై విచారణ చేపట్టినట్లు తెలిసింది. గుప్తనిధుల కోసం పూజలు నిర్వహించారన్న ఆరోపణల్లో వాస్తవాలపై పోలీసుల విచారణ అనంతరం స్పష్టత రావాల్సి ఉంది.

25 టీఎంసీల నీరు ఏమైంది?

తాగునీటికి కటకట.. పరిశ్రమలకు నీటి సరఫరాపై ప్రశ్నలు!

సింగూర్ నిల్వలు తగ్గడంపై బీఆర్ఎస్ నేతల విమర్శలు

సంగారెడ్డి , నిలువుటద్దం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో తాగునీటి సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గడంపై రాజకీయ దుమారం రేగుతోంది. గత ఏడాది ప్రాజెక్టులో సుమారు 29 టీఎంసీల నీరు ఉండగా, ప్రస్తుతం మూడు టీఎంసీలకు పడిపోయిందని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. ఇందులో ఒక టీఎంసీ డెడ్ స్టోరేజీ కాగా, మిగిలిన నీరు ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టు మరమ్మతుల పేరుతో నీటిని దిగువకు విడుదల చేశారంటూ ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. మరోవైపు సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లోని బీర్, ఫార్మా పరిశ్రమలకు మంజీరా జలాల సరఫరా కొనసాగుతోందా? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలకు 20 శాతం నీటి కోత విధించారని, నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోందని ఆరోపిస్తున్నారు. మంజీరా జలాల కొరత నేపథ్యంలో బీర్ పరిశ్రమలు రైతుల బోర్ల నుంచి నీటిని అద్దెకు తీసుకుంటున్నాయన్న ప్రచారం కూడా చర్చనీయాంశంగా మారింది. దీనివల్ల భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. రైతులు పంటలను కాపాడుకునేందుకు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే పరిశ్రమలకు నీటి సరఫరా విషయంలో ప్రాధాన్యం ఎలా ఇస్తున్నారని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నీటి కొరతపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గడానికి కారణాలేమిటి? పరిశ్రమలకు ఎంత మేర నీటిని సరఫరా చేస్తున్నారు? తాగునీటి అవసరాలకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఖాజాగూడ జంక్షన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలి

నిలువుటద్దం ప్రతినిధి: హైదరాబాద్ తెలంగాణ అక్టోబర్ 27: పోలీస్, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలి ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ హైదరాబాద్, అక్టోబర్ 27 (ఉషోదయం) హైదరాబాద్ నగరంలోని ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న అభివృద్ధి పనుల సమయంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాజాగూడ జంక్షన్‌ను సందర్శించిన ఆయన, అక్కడ జరుగుతున్న ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

ఖాజాగూడ జంక్షన్‌లో జరుగుతున్న నిర్మాణ పనుల కారణంగా ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సీపీ సూచించారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఇందుకోసం పోలీస్ శాఖ, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులకు సంబంధించి అండర్‌పాస్ మార్గంలో ఉన్న పైప్‌లైన్ల మార్పులు, విద్యుత్ లైన్ల తరలింపు, ఇతర సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చించారు. పనులు వేగంగా కొనసాగడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ తాత్కాలిక ఏర్పాటుపై పరిశీలన

ఖాజాగూడ జంక్షన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో రాయదుర్గం పోలీస్ స్టేషన్‌ను తాత్కాలికంగా మరో ప్రాంతానికి తరలించే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో మణికొండలోని జీహెచ్ఎంసీ కమిటీ హాల్‌ను సీపీ డాక్టర్ ఎం. రమేష్ సందర్శించి పరిశీలించారు.